క్లుప్తంగా

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలో దుర్గమ్మ గుడి వద్ద ప్రభుత్వ గుర్తింపు లేకుండా తల్లిదండ్రులను మోసం చేసి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ కార్పొరేటు స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రాహుల్, వీరబాల శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం అనుమతి లేకుండా నడుస్తున్న నారాయణ కార్పొరేట్ స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు చిన్ని సగిలి రాజేంద్ర ప్రసాద్, రాజశేఖర్ మనోజ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గాయపడిన బాలికకు ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రమాదానికి గురై చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలికకు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. గంగిరెడ్డిపల్లెకు చెందిన బాలిక వెన్నెల తీవ్రంగా గాయపడి చికిత్స పొందేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయాన్ని స్థానికులు లయన్స్ క్లబ్ ప్రతినిధులకు చేరవేశారు. స్పందించిన లయన్ ఎ.వెంకటసుబ్బయ్య, పి.సంజీవరెడ్డిలు రూ. 22 వేల మొత్తాన్ని బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీకి వినతి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అనుమతులు లేకుండా నడుపుతున్న కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం ఆర్‌జేడీ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ తక్షణమే జిల్లాలో ఒక అధికారిని నియమించి విద్యాసంస్థలన్నింటినీ సందర్శించి అన్ని విషయాలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిక్ పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం పరిశీలన

కడప అర్బన్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులు, ప్రతినిధులు కడప కేంద్ర కారాగారం సందర్శించారు. ఈ సందర్భంగా కారాగారం పరిసరాలను, వసతిగదులను, వంటగదిని, టాయిలెట్స్‌లను వారు పరిశీలించారు. రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కడపలోని పురుషుల కేంద్ర కారాగారంతో పాటు, ప్రత్యేక మహిళా కారాగారం, అన్నమయ్య జిల్లా రాయచోటి సబ్ జైలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్రకారాగారం అధికారులు, సబ్‌జైలు అధికారులు పాల్గొన్నారు.

హాకీ.. చలాకీగా..

హాకీ శిక్షణ పొందుతున్న చిన్నారులు



శిక్షణకు హాజరవుతున్న క్రీడాకారులతో శిక్షకుడు కల్యాణ్



వేసవి సెలవులు కావడంతో చిన్నారులు సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో క్రీడా శిక్షణ శిబిరాలకు హాజరై తమలోని క్రీడానైపుణ్యాలకు పదునుపెడుతున్నారు. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో హాకీ శిక్షకుడు కల్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాకీ శిక్షణకు చిన్నారుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది.

ఉత్సాహంగా హాకీ శిక్షణా శిబిరం

కడప స్పోర్ట్స్: జాతీయ క్రీడగా గుర్తింపు ఉన్న హాకీ క్రీడలో రాణించేందుకు.. భవిష్యత్‌లో చక్కటి క్రీడాకారులుగా రాణించేందుకు పునాదిగా నిలుస్తోంది హాకీ శిక్షణ శిబిరం. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న హాకీ శిక్షణ శిబిరంలో చిన్నారులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వేసవి సెలవులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు పలువురు చిన్నారులు వస్తుండగా... హాకీ క్రీడలో రాణించేందుకు మరికొందరు క్రీడాకారులు శిబిరానికి వస్తున్నారు. హాకీ క్రీడలోని బేసిక్ అంశాలతో పాటు మెలుకువలు తెలియజేస్తుండటంతో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఏఏ అంశాలపై శిక్షణ ఇస్తున్నారంటే...

హాకీ క్రీడకు ఫిట్‌నెస్ చాలా ముఖ్యం. దీంతో ఫిట్‌నెస్ కోసం చిన్నారులను తొలుత రన్నింగ్ మొదలు వివిధ రకాల వ్యాయామాలు చేయిస్తున్నారు. దీంతో పాటు బ్యాట్ పట్టుకునే విధానం మొదలు బాల్ హిట్టింగ్, పాసింగ్, పుష్షింగ్, స్కూప్, స్టాపింగ్, డ్రిబ్లింగ్, పొజిషన్, రోలింగ్, టాపింగ్ తదితర అంశాలపై కోచ్‌లు మెలకువలు నేర్పుతున్నారు.

హాకీ క్రీడాకారిణిగా రాణించాలని..



హాకీ క్రీడాకారిణిగా రాణించాలన్న ఆసక్తితో శిక్షణ శిబిరానికి వస్తున్నా ను. గతేడాది నుంచి హాకీ శిక్షణ శిబిరానికి వస్తున్నా. జాతీయస్థాయిలో హాకీ లో రాణించాలన్న లక్ష్యంతో ప్రతిరోజూ సాధన కు వస్తున్నా. ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. గతేడాది అండర్-19 జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొన్నాను.

– గౌరి, ఇంటర్ విద్యార్థిని

హాకీ శిక్షణకు వస్తున్నా...



వేసవి సెలవుల్లో హాకీలో మెలకువలు నేర్చుకునేందుకు శిక్షణ శిబిరానికి వస్తున్నా. ఇక్క డ చక్కటి వ్యాయామాల తో పాటు ప్రాథమిక అంశాలపై చక్కగా శిక్షణ ఇస్తున్నారు. గతంలో కేడీ సింగ్‌బాబు హాకీ నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం నాకు లభించింది. – సుశాంత్, 7వ తరగతి, కడప

భోజన తయారీలో పరిశుభ్రతను పాటించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

వల్లూరు : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన తయారీలో పరిశుభ్రతతో పాటు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారులు లిల్లెమ్మ, విజయరెడ్డి తెలిపారు. గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజన వంట ఏజన్సీల నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయలను శుభ్రంగా కడిగి వంట చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఎలా అమలు చేయాలో రీసోర్స్ పర్సన్ శివకుమార్‌రాజు వివరించారు. వంట చేసే విధానాన్ని గురించి రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రీసోర్స్ పర్సన్ రిహానా వివరించారు. అనంతరం వంట ఏజన్సీల నిర్వాహకులకు, సహాయకులకు వంటల పోటీలను నిర్వహించారు. వెంకటాపురం ప్రాథమిక పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలు శ్రీలత మొదటి బహుమతిని గెలుపొందారు. వల్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలు లక్ష్మీదేవి ద్వితీయ బహుమతిని, గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలు దిల్షాద్ తృతీయ బహుమతిని పొందారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై చైతన్యం అవసరం

– ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కడప ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇందుకోసం కాలుష్య నియంత్రణ మండలి చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ కార్యాలయం ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ డాక్టర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు జూన్ 5వ తేదీన జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితిస్థాపకత, 'మనభూమి – మన భవిష్యత్తు' నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల స్థాయి, కళాశాల స్థాయి కేటగిరీలుగా పోటీలు నిర్వహించారు. కాంపిటీషన్ సెలక్షన్ కమిటీ చైర్మన్ డా. పి. సుబ్రమణ్యం, సభ్యులు రాజశేఖరరెడ్డి, నాగేంద్రకుమార్, రవిశేఖర్, ఎన్విరాన్‌మెంటల్ సహాయ ఇంజినీర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎన్‌జీఓ ప్రతినిధి మునెయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన అన్నమయ్య సర్కిల్, క్రిష్టా సర్కిల్, గోకుల్ లాడ్జి, దేవునికడప రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నమయ్య సర్కిల్ నుంచి క్రిష్టా సర్కిల్ వరకూ జరుగుతున్న పనుల్లో డివైడర్, స్టోన్ క్లోడింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, కాలువపై మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేయాలని, డివైడర్‌లో మొక్కలు నాటి గ్రీనరీ పెంచాలన్నారు. క్రిష్టా సర్కిల్ నుంచి గోకుల్ జంక్షన్ వరకూ డివైడర్‌పై గ్రిల్స్ వేసి, పెయింటింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. ఫుట్‌పాత్‌లో ప్లాస్టింగ్ చేయించాలన్నారు. దేవునికడప రోడ్డులో మాచుపల్లి ప్లాజా వద్ద శుభ్రం చేయించి, మొక్కలు నాటాలన్నారు. దేవునికడప సర్కిల్‌లో అప్రోచ్ రోడ్లు పూర్తి చేయాలన్నారు. మార్కెట్ యార్డు జంక్షన్ పనులను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమంతునికి పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని నెహ్రూనగర్‌లో గల శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో 27వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా హనుమంతునికి పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ధర్మకర్త తాళ్లపాక సురేష్ , అర్చకులు జి.కిరణ్‌కుమార్‌శర్మలు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గణపతిపూజ, నవగ్రహజపాలు, అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం సహస్ర నామార్చన, దీక్షా హోమం తదితర పూజలు నిర్వహించారు. శనివారం హనుమజ్జయంతి పూజలతో ఉత్సవాలు ముగియనున్నాయి.

నేడు హనుమజ్జయంతి

హనుమజ్జయంతి సందర్భంగా శనివారం కడప నగరంలోని దాదాపు 50 ఆంజనేయస్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటల నుంచి అభిషేకం, ఆకుపూజలు, రుద్రహోమం, ధ్వజావరోహణం, లక్ష్మీహోమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5.00 గంటలకు కోలాటాలతో కూడిన గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

- శంకరాపురంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో , శ్రీ కామకోటి కళాంబ సమేత శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో, మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో, సాయిపేట శ్రీ రామాంజనేయనగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు.



విశేష అలంకారంలో పంచముఖ ఆంజనేయస్వామి

- శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కడప నగరంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవికి ఉదయం 6 గంటల నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు.
- పాత బస్టాండువద్దగల శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం నుంచి కొనసాగుతున్న ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కలశ పూజ, సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. చెన్నూరుకు చెందిన భజన మండలి హనుమాన్ చాలీసా పారాయణం, టీటీడీ కళాకారుల హరికథా గానం నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు బ్రహ్మంగారిమఠం తోట్లపల్లె శ్రీ అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి ప్రవచనం ఉంటుంది. 6 గంటలకు గ్రామోత్సవం, చాపాడు కళాకారుల కోలాటం, మైదుకూరు పార్వతీపురం కళాకారుల రామాయణ ఘట్టాల ప్రదర్శన నిర్వహిస్తారు.
- అల్మాస్‌పేటలోని శ్రీ విఘ్నేశ్వర అభయాంజనేయ సాయినాథ ఆలయంలో శనివారం ఉదయం 4.30 గంటల నుంచి విశేష పూజలు నిర్వహిస్తారు. 8.00 గంటలకు హోమాల పూర్ణాహుతి ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, 2.30 నుంచి గ్రామోత్సవం నిర్వహిస్తారు.
- వక్కలపేటలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 6.00 గంటల నుంచి విశేష పూజలు, సాయంత్రం 3.00 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకువిశేష పూజలు నిర్వహిస్తారు.

5న పర్యావరణ రక్షణపై పోటీలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన పర్యావరణ మిత్ర సమూహం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 5 న వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ సభ్యులు డాక్టర్ ప్రసాదురెడ్డి తెలిపారు. 5–10 ఏళ్ల లోపు వయస్సుగల విద్యార్థులు పక్షులు వాలిన చెట్టు చిత్రం గీయాల్సి ఉంటుందని, 11–15 సంవత్సరాల వయస్సులోపు వారు నేనైతే చెట్టును ఇలా రక్షిస్తాను అనే అంశంపై, 16–22 సంవత్సరాలలోపు వయస్సుగల విద్యార్థులు మనిషి జీవన చక్రంలో చెట్టు అనే అంశంపైన చిత్రాలు గీయాల్సి ఉంటుందన్నారు. 23 సంవత్సరాల పైబడి వయస్సుగల వారు మనిషికి చెట్టే ఆధారం అనే అంశంపై చిత్రం గీయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నాలుగు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతులు కూడా ఇస్తామన్నారు. చిత్రం గీసేందుకు అవసరమైన రైటింగ్ ప్యాడ్స్, రంగులు, కుంచెలు తదితర సామాగ్రిని విద్యార్థులే తెచ్చుకోవాలని, బొమ్మ గీసేందుకు ఏ4 సైజ్ డ్రాయింగ్ షీట్‌ను నిర్వాహకులే అందజేస్తారని తెలిపారు. చిత్రం గీసేందుకు రెండు గంటల సమయం ఇస్తామన్నారు. జూన్ 5న ఉదయం 9 నుంచి 11 గంటల్లోపు ఈ పోటీ ఉంటుందన్నారు. అనంతరం ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులను కూడా ప్రదానం చేస్తామని వివరించారు. రాయచోటిరోడ్డు ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ పార్కులో ప్రముఖుల సమక్షంలో బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 62815 60089 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

కమలాపురం : మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం స్థానిక షాలెం ప్రార్థన మందిరంలో జరిగింది. కమలాపురం మండలంలోని వివిధ చర్చీలకు చెందిన పాస్టరులు హాజరై మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రభుదాస్, వైస్ ప్రెసిడెంట్‌గా హెప్సిబా క్రిష్టియానా, సెక్రటరీగా సునీల్‌దత్, జాయింట్ సెక్రటరీగా స్టీఫెన్, ట్రెజరర్‌గా రాజ్ కుమార్, ఈసీ మెంబర్‌గా రాజు, జాషువా, గౌరవాధ్యక్షుడిగా పాల్ కుమార్, గౌరవ సలహాదారుడిగా సురేష్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ప్రెసిడెంట్ ప్రభుదాస్, సెక్రటరీ సునీల్‌దత్‌లు మాట్లాడుతూ క్రైస్తవ సమాజ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ప్రపంచ శాంతి కోసం ప్రత్యేకంగా ప్రార్థన చేశారు. అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశారు. సంఘ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఏడీఏ సేవలు మరవలేనివి

కడప అగ్రికల్చర్: వ్యవసాయశాఖలో ఏడీఏగా దాది సుబ్బారావు రైతులకు అందించిన సేవలు మరువలేనివని కడప, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులు అయితా నాగేశ్వరరావు, చంద్రానాయక్‌లు అన్నారు. వైఎస్సార్‌జిల్లా కడప ఏడీఏగా పనిచేస్తున్న దాది సుబ్బారావు పదవీ విరమణ సన్మానసభను శుక్రవారం రాత్రి కడపలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఏడీఏ సుబ్బారావు అందరినీ సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో విధులు నిర్వర్తించారన్నారు. అనంతరం ఏడీఏ సుబ్బారావుతోపాటు ఆయన సతీమణిని ఘనంగా సన్మానించారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



ఏడీఏ సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తదితరులు

ఈ కార్యక్రమంలో కేవీకే కో ఆర్డినేటర్ వీరన్న, ఏఆర్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసాచారి, ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, మార్కెఫెడ్ డీఎం నరసింహారెడ్డి, ఆర్‌జేడీ కార్యాలయ ఏవో సుమంత్‌రెడ్డి, కడప ఏవో సురేష్‌కుమార్‌రెడ్డిలతోపాటు పలువురు ఏడీఏలు, ఏవోలు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సత్కారం

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికి పదవీ విరమణ అనేది ఏదో ఒక రోజు తప్పదని ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ పేర్కొన్నారు. కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అహ్మద్‌బాష శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో ఆయన సన్మానసభను ఘనంగా నిర్వహించారు. ఈయనకు ప్రిన్సిపాల్ నూర్జహాన్‌తోపాటు సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అహ్మద్‌బాష విద్యాశాఖలో 37 సంవత్సరాల సర్వీసును అంకితభావంతో పనిచేస్తూ ఉన్నత ఉద్యోగుల, సహ ఉద్యోగల మన్ననలను పొందారన్నారు. ఇంటర్ ఆర్‌ఐవో, ఆర్‌జేడీ కార్యాలయాల్లో కూడా అహ్మద్‌బాష వివిధ హోదాల్లో పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శి చెప్పలి రాజారావు, ఇన్‌చార్జు ప్రిన్సిపాల్ హబీబుల్లా పాల్గొన్నారు.



సీనియర్ అసిస్టెంట్ అహ్మద్‌బాషను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

ఉద్యోగ విరమణ తప్పనిసరి

– జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ ఏఓ ఎంవీ రంగాచార్యుల సేవలు నేటితరం ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. రంగాచార్యుల ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ జీవితంలో రంగాచార్యులు ఎంతో నిబద్ధతతో పని చేసి అందరి ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు. ఆయన శేష జీవితం కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రంగాచార్యుల దంపతులను ఘనంగా సత్కరించారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల నుంచి వచ్చిన అర్చకులు వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు నాగిరెడ్డి, లంకా మల్లేశ్వర్‌రెడ్డి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఎంపీడీఓలు, డీఎల్‌డీఓలు, పంచాయతీరాజ్, డ్వామా ఉద్యోగ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రంగాచార్యుల దంపతులను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

విధి నిర్వహణలో అంకితభావం ముఖ్యం

రాయచోటి(వ్యవసాయం) : అన్నమయ్య జిల్లా విద్యాశాఖలో పథకాల సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న పి. నరసింహులు ప్రభుత్వ పథకాలను అర్హత కలిగిన విద్యార్థులందరికీ చేరువ చేయించి అందరి మన్ననలను పొందారని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి కొనియాడారు. నరసింహులు శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయ ఆవరణలో నరసింహులుకు అభినందన, సన్మాన సభను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఇతర అధికారులు మాట్లాడుతూ నరసింహులు అంకితభావంతో విధులు నిర్వహించారని, ఆయన సేవలు మరువలేనివన్నారు. అనంతరం నరసింహులు, ఆయన సతీమణిని విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, అధికారులు కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఏడీ ప్రసాద్‌బాబు, ఓపీసీ శ్రీనివాసరాజు, ఏఎస్ఓ నాగేంద్ర, ఆర్జేడీ సిబ్బంది, కడప డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నరసింహులు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఘన సన్మానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రొద్దుటూరు కార్మికశాఖ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న బీవీ రమణారెడ్డి సేవలు ప్రశంసనీయమని కర్నూలుజోన్ సంయుక్త కార్మిక కమిషనర్ బాలునాయక్ తెలిపారు. బీవీ రమణారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా కడపలోని కార్మికశాఖ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ రమణారెడ్డి శేష జీవితం సుఖ సంతోషాలతో సాగాలని కోరుకుంటున్నామన్నారు. ఉప కార్మిక కమిషనర్ శ్రీకాంత్‌నాయక్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



బీవీ రమణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీనివాసులు సేవలు ఆదర్శం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉద్యోగి కుప్పాల శ్రీనివాసులు శుక్రవారం ఉద్యోగ విధుల నుంచి విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఐఎంఏ హాలులో జిల్లాలోని అన్ని గ్రంథాలయ శాఖల ఉద్యోగులు, పూర్వ ఉద్యోగులు, శ్రీనివాసులు బంధు మిత్రులు హాజరై శ్రీనివాసులు, రేవతి దంపతులను ఘనంగా సత్కరించారు.